క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గోవాడ(వేమూరు) అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాపర్ల నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి మేరుగ నాగార్జున హాజరవుతారని వివరించారు.

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోండి

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం సాగుకు సాయమందించేందుకు ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా, కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులు ఈనెలాఖరు లోపు రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కర్లపాలెం ఏవో సుమంత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలను వినియోగించుకుంటున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ గ్రామీణ యువతకు ఉపాధి కల్పించటానికి 40శాతం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్లను మంజూరు చేస్తుందని, కావలసిన వారు గ్రూపుగా ఏర్పడి మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని ఏవో కోరారు.

నేటి నుంచి భట్టిప్రోలులో రక్షణ స్వస్థత సభలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు బేతేలు ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు రక్షణ స్వస్థత సువార్త సభలు జరుగుతాయని నిర్వాహకులు పాస్టర్ కె.అబ్రహం గురువారం తెలిపారు. ప్రసంగీకులుగా బ్రదర్ నానాజీ, పాస్టర్ ఎ.రమేష్, రెవరెండ్ దొడ్డా జకర్యా, బిషప్ హోసన్న, బ్రదర్ డి.శ్యామ్‌కుమార్, డాక్టర్ జార్జ్ దొడ్డాలు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నట్లు వివరించారు.

నాన్ బీపీటీ ధాన్యం కొనాలి



అమర్తలూరు(వేమూరు) నాన్ బీపీటీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతాంగ సమాఖ్య నాయకులు మైనేని రత్న ప్రసాద్ కోరారు. ఆయన మాట్లాడుతూ అమర్తలూరు మండలంలోని రైతులు వరి కుప్పలు వేశారని, రబీ పంట మినుము, పెసర పంటలు పూర్తయిన తర్వాత నూర్పిడి పనులు ప్రారంభించారని, ప్రభుత్వం మద్దతు ధర రూ.1,545 ప్రకటించిందని, ప్రైవేటు వ్యాపారులు రూ.1,300కి కొనుగోలు చేస్తున్నారని, నాన్ బీపీటీ ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

చందోలులో రూ.3 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



పిట్టలవానిపాలెం: చందోలులో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించినట్లేనని విద్యుత్ శాఖ బాపట్ల డీఈ ఆంజయేయులు తెలిపారు. చందోలులో కొత్తగా రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి, సీఎండీ పద్మజనార్దనరెడ్డి కృషి ఫలితంగా సబ్‌స్టేషన్ మంజూరైందని, పనులూ త్వరగా పూర్తిచేయడం అభినందనీయమని చెప్పారు. చందోలు పరిధిలోని సంగుపాలెం, కోడూరు గ్రామాలకూ నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆయన వెంట గుంటూరు ఆపరేషన్ డీఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ



వరహాపురం(వేమూరు) ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో గ్రామ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రావణ కుమార్ తెలిపారు. వరహాపురం గ్రామ సచివాలయం రికార్డులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. చంపాడు గ్రామ సచివాలయం ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు సాయిబాబా మందిరం వార్షికోత్సవం

తెనాలిటౌన్: రామలింగేశ్వరపేటలోని సాయిబాబా మందిరం వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు మందిరం సేవా సమితి ప్రెసిడెంట్ ఎస్.బాలదుర్గాప్రసాద్ తెలిపారు. మందిరంలో బాబా విగ్రహం ఏర్పాటు చేసి 73 ఏళ్లు అయ్యిందని పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఎంట్రీ అదుర్స్



వృక్ష ఉల్లాసం : భట్టిప్రోలు-పెదపులివర్రు దారిలో ఇలా..



అందాల కలికి'తురాయి' : భట్టిప్రోలు-రేపల్లె మార్గంలో అగ్నిపూల అందాలు

భట్టిప్రోలు–పెదపులివర్రు మార్గంలో పచ్చని చెట్లు ఆహ్లాదాన్నిస్తున్నాయి. పెదపులివర్రు గ్రామంలోకి ప్రవేశించేటప్పుడు దారికి ఇరువైపులా ఉన్న చెట్లు ఎండ నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి. ఆ ప్రాంతానికి రాగానే ప్రయాణికులు కాసేపు ఆగి చెట్ల నీడన ప్రకృతిఒడిలో సేదదీరుతున్నారు. చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. భట్టిప్రోలు–రేపల్లె మార్గంలోనూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అగ్నిపూలు(తురాయి) చెట్లు అందరికీ కనువిందు చేస్తున్నాయి. – భట్టిప్రోలు

వానరాల హల్ చల్



భట్టిప్రోలులో వానరాలు హల్‌చల్ చేస్తున్నాయి. స్థానికులను హడలెత్తిస్తున్నాయి. చేతుల్లో చిన్న పొట్లాలు కనిపించినా చిన్నారులు, మహిళల వెంటపడి మరీ దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా భట్టిప్రోలు విఠలేశ్వరనగర్‌లో కోతుల బెడద అధికంగా ఉంది. పలువురు కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రి పాలయ్యారు కూడా. అధికారులు వెంటనే స్పందించి కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – భట్టిప్రోలు

జగనన్నే మా భవిష్యత్

- ఇంటింటా జగన్నినాదం
- వైఎస్సార్ సీపీ నేతలకు గడప గడపనా ఘన స్వాగతం



భట్టిప్రోలు మండలం ఐలవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు/రేపల్లె/బాపట్ల: బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గడప గడపనా వైఎస్సార్ సీపీ నేతలకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. జయహో జగన్ అంటూ నినదిస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి) ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం భట్టిప్రోలు సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమాలలో కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పీజీ అరుణ్ శాస్త్రి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి), తలకొల యలమంద, షేక్ అబ్దుల్ కరీమ్, పెరికల శ్యామ్, వలంటీర్లు పాల్గొన్నారు. ఐలవరం సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, గ్రామ కన్వీనర్ మాచర్ల తులసి రంగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మాచర్ల వీరేంద్ర, జొన్నాదుల శరత్, గట్టు శ్రీనివాసరావు, సంగాబత్తుని వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు కర్రా కిషోర్, కేబీవీ రమణ, మాచర్ల శ్రీదేవి, గద్దం శ్రీనివాసరావు, తాతా అశోక్, బి. రాజారావు, గోలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

■ రేపల్లె పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ నాగలక్ష్మి, 11వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డ్ ఇన్‌చార్జ్ యార్లగడ్డ బుచ్చిరావు, 23వ వార్డులో కౌన్సిలర్ తులసీ దుర్గాప్రసాద్, రేపల్లె మండలం పెనుమూడిలో దారం విజయ్, పేటేరులో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, ఉప్పూడిలో గుజ్జర్లమూడి విజయబేబి, పోటుమెరకలో సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ తదితరులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు.

■ బాపట్ల ప్యాడిసన్‌పేటలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఇసగలూరి మాల్యాద్రి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. 10వ వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రంజిత్, నత్తానియేల్, చల్లా రామయ్య పాల్గొన్నారు.



ఐలవరంలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో..



భట్టిప్రోలులో..



రేపల్లె మండలం పేటేరులో..



బాపట్ల ప్యాడిసన్ పేటలో..



రేపల్లె 4వవార్డులో..



రేపల్లె మండలం పెనుమూడిలో..

ప్రాంగణ ఎంపికల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

బాపట్ల అర్బన్: హెటిరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 11న నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో మెకానికల్ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. సభలో ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ తరగతులు నిర్వహించి రాబోయే రోజులలో వంద శాతం ప్లేస్మెంట్ దిశగా పాలిటెక్నిక్ కాలేజీని తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వన్ అండ్ టు దొబ్బల పూడి రామ్మోహన్‌రావు, గెల్లి దిలీప్ కుమార్, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణ విద్యార్థులను అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు

కనీస జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు దూరం

సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

రేపల్లె రూరల్: కనీస జాగ్రత్తలు పాటించటంతో అగ్నిప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైలు, బస్సు వంటి వాహనాలలో ప్రయాణించే సమయంలో పెట్రోలు, కిరోసిన్, గ్యాస్ వంటి పదార్థాలను తీసుకెళ్లరాదని పేర్కొన్నారు. ట్రాక్టర్లలో మితిమీరిన గడ్డిని తీసుకెళ్లటంతో పొరపాటున గడ్డి విద్యుత్ తీగలకు తగిలి అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. ఇళ్లల్లో చిన్నచిన్న జాగ్రత్తలు పాటించటంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోవని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

దెబ్బతిన్న పొలాల పరిశీలన

నగరం: అకాల వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ, మొక్కజొన్న పొలాల జాబితాను రూపొందించినట్లు చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.సరోజిని చెప్పారు. అద్దంకివారిపాలెం, కారంకివారిపాలెం, ధూళిపూడి గ్రామాలలో దెబ్బతిన్న పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. సరోజిని మాట్లాడుతూ గత నెలలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పొలాలను అధికారులు గుర్తించి జాబితాను రూపొందించినట్లు వివరించారు. జాబితాల ఆధారంగా నష్టపోయిన పొలాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయాధికారి రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలోని 8 రెవెన్యూ గ్రామాలలో 1,650 ఎకరాలలో వేరుశనగ, మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని వివరించారు. 1275 మంది రైతులతో జాబితా రూపొందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు, మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏఈవో కె.నాగశ్రీనివాసరావు, వీఏఏలు పాల్గొన్నారు.



ధూళిపూడిలో దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీఓ సరోజిని

ఐలవరంలో సచివాలయం పరిశీలన

ఐలవరం(భట్టిపోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం–1 సచివాలయాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకే, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. ఐలవరంలోని 4 జగనన్న లే–అవుట్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను పరిశీలించి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు హ్యాండ్ వాష్ ఆవశ్యకత గురించి వివరించారు.



ఐలవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న హనుమంతరావు

ప్రచారభేరి పోస్టర్ల ఆవిష్కరణ

భట్టిప్రోలు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార భేరిని విజయవంతం చేయాలని ఆ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ప్రచారభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పి. నాగాంజనేయులు, జి.సుధాకర్, బండారు శ్రీనివాసరావు, జి. బాలాజీ, ఎం.సత్యన్నారాయణ, జి.నాగరాజు, డి.సత్యన్నారాయణ, బి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ఇఫ్తార్ విందు



మోపర్రు(వేమూరు) రంజాన్ మాసం సందర్భంగా గురువారం మోదుకూరి హరిబాబు ఆధ్వర్యంలో మోపర్రులోని ముస్లింలకు ఇఫ్తార్ విందునిచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ చందన్‌నాగ్ కార్యక్రమంలో పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆళ్ళ వెంకట రమణారెడ్డి, షేక్ హుస్సేన్, షేక్ నాగూర్‌వలీ, కొండపల్లి వినయ్, గర్నిపూడి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమావాస్య హోమం

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో 50వ అమావాస్య హోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు కామధేనువు, కల్పవృక్షంగా దర్శనమిచ్చారు. ఈఓ జి.నరసింహమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఈనెల 28న అమ్మవారి జయంతిని పురస్కరించుకుని అష్టోత్తర కలశ స్నపన నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

బాపట్లటౌన్: అగ్నిప్రమాదాలపై అందరికీ అవగాహన అవసరమని ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. ఈనెల 14 నుంచి జరుగుతున్న అగ్నిప్రమాద వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఆర్టీసీ బస్టాండ్‌లు, కళాశాలల్లోని విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అజితకుమారి మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు అధికసంఖ్యలో జరిగే ఆస్కారం ఉందని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.



పోస్టర్లు ఆవిష్కరించిన అగ్నిమాపక సిబ్బంది

చికిత్స పొందుతూ యువతి మృతి

రేపల్లె రూరల్: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో గడ్డి మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువతి మృతి చెందినట్లు పట్టణ సీఐ విజయ చంద్ర తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేపల్లె మండలం అరవపల్లి గ్రామానికి చెందిన కస్తూరి కనకలింగేశ్వరరావు కుమార్తె పూజిత(23) బీటెక్ చదువు మధ్యలో ఆపివేసింది. చదువు పూర్తి చేయాలని తల్లిదండ్రులు మందలించటంతో ఈనెల 18న గడ్డి మందు తాగింది. అస్వస్థతకు గురైన ఆమెను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి కనకలింగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కౌన్సిలర్ అన్నెకు నివాళి

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిలర్ అన్నె రామకృష్ణ సంతాప సభను గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, కౌన్సిల్ సభ్యులు అన్నె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు రామకృష్ణ సేవలను కొనియాడారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ అన్నెకు నివాళులర్పిస్తున్న దృశ్యం

క్రీడాకారుడు మధుబాబుకు సాయం

తెనాలి: హ్యాండ్‌బాల్ జాతీయ జట్టు గోల్‌కీపర్‌గా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక తెనాలి క్రీడాకారుడు జెర్రిపోతుల మధుబాబును ఐఆర్‌ఎస్ అధికారి, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ దోనేపూడి మధుబాబు అభినందించారు. రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. పేద దళిత బిడ్డ మధుబాబు జాతీయ జట్టులో స్థానం సంపాదించి ఈనెల 25–30 తేదీల్లో బల్గేరియాలో జరగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విషయం తెలిసిందే. ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఐఆర్‌ఎస్ అధికారి రూ.15 వేలను అందజేసి, ఆశీర్వదించారు. మధుబాబుకు శిక్షణనిచ్చిన కోచ్ కె.నాగరాజును అభినందించారు.

ఆర్యవైశ్య సంఘ నేతల సాయం

తెనాలి: జెర్రిపోతుల మధుబాబుకు పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాలు రూ.30 వేల ఆర్థికసాయాన్ని అందజేశాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆతుకూరి పూర్ణచంద్రరావు, చుండూరు సాయి, మద్దాళి శేషాచలం పాల్గొన్నారు.

కార్మికులు పథకాలను వినియోగించుకోవాలి

తెనాలి: అసంఘటిత కార్మికుల కోసం పలు ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెనాలి సహాయ కార్మిక కమిషనర్ డీవీ శివప్రసాద్ కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్, వర్కింగ్ పీపుల్స్ కోయాలిషన్, ఇండియా లేబర్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయం దగ్గర భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సహాయ లేబర్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ అసంఘటిత కార్మిక వ్యవస్థ గురించి అందరికీ వివరించారు. నిరుద్యోగులుగా ఉన్న ప్రతిఒక్కరినీ అసంఘటిత కార్మికులుగా పరిగణిస్తారని తెలిపారు. కార్మికశాఖ ద్వారా వీరికి అనేక ప్రభుత్వ పథకాలు ఉన్నాయని చెబుతూ వీటిలో ప్రసూతి ప్రయోజనాలు, ప్రమాద బీమా ముఖ్యమైనవిగా చెప్పారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ నిధిలోంచి వీటికి క్లెయిమ్ చేస్తామని వివరించారు. కార్మిక శాఖ సహాయ జిల్లా అధికారి వినయ్‌కుమార్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులను గుర్తించి, వారిని సమీకరించి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ బృందాన్ని అభినందించారు.